## ధాన్యం కొనుగోలులో రైతులను ఇబ్బంది పెట్టొద్దు

• కలెక్టర్ హరిచందన



రైస్ మిల్లర్ల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరిచందన

మిర్యాలగూడ, మార్చి 28 : ధాన్యం కొనుగోలులో రైతులను ఇబ్బంది పెట్టొద్దని కలెక్టర్ దాసరి హరిచందన మిల్లర్లకు సూచించారు. గురువారం వేములపల్లి మండలం శెట్టిపాలెం శివారులోని పద్మశ్రీ రైస్ మిల్లును ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైస్ మిల్లులో ధాన్యం మరాడించే కెపాసిటీ, సీఎంఆర్ చెల్లింపు, ధాన్యం కొనుగోలు ఎలా చేస్తున్నారనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో రైస్ మిల్లర్లు, ఆయా శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఈ యాసంగిలో 5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని అంచనా వేసినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 370 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి మిల్లులకు తరలించాలన్నారు. మిల్లర్లు సకాలంలో ధాన్యం దిగుమతి చేసుకోవాలన్నారు. గత వానకాలానికి సంబంధించి 2,16,248 మెట్రిక్ టన్నుల సీఎంఆర్‌ను ప్రభుత్వానికి ఇవ్వాల్సి ఉండగా ఇప్పటివరకు 30,136 టన్నుల బియ్యం ఇచ్చినట్లు తెలిపారు. మిగిలిన 1,86,144 టన్నుల బియ్యాన్ని ఏప్రిల్ 30లోపు ఇవ్వాలని సూచించారు. ప్రతిరోజు 4 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం ప్రొక్యూర్మెంట్ పెట్టాలన్నారు. ప్రభుత్వ మద్దతు ధర గ్రేడ్-1 ధాన్యానికి రూ.2,203, సాధారణ రకానికి రూ.2,183 ధర నిర్ణయించిందన్నారు. మిల్లర్లు సన్నరకం ధాన్యాన్ని కొనుగోలు చేయాలని సూచించారు. సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీనివాస్, డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు, సివిల్ సప్లయ్ డీఎం నాగేశ్వర్‌రావు, ఆర్డీఓ శ్రీనివాస్‌రావు, మార్కెటింగ్ ఏడీ శ్రీకాంత్, అగ్రికల్చర్ ఏడీ నాగమణి, తాసీల్దార్లు హరిబాబు, ప్రమీల, శ్రీనివాస్ శర్మ, సివిల్ సప్లయ్ డీటీ షేక్ జావిద్, ఆర్‌ఐ సురేందర్‌సింగ్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కర్నాటి రమేశ్, మిర్యాలగూడ అసోసియేషన్ అధ్యక్షుడు గౌరు శ్రీనివాస్ పాల్గొన్నారు.

### హోం ఓటింగ్‌ను వినియోగించుకోవాలి

నల్లగొండ : 85 ఏండ్లు నిండిన వయోవృద్ధులు హోం ఓటింగ్ విధానాన్ని ఉపయోగించుకోవాలని, ఇతరులు పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు వేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి దాసరి హరిచందన సూచించారు. గురువారం కలెక్టరేట్ కార్యాలయంలో వయో వృద్ధుల ఓటు హక్కు వినియోగంపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. అదనపు కలెక్టర్ పూర్ణచందర్, స్వీప్ నోడల్ అధికారి, జడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి సక్కుబాయి, మల్లికార్జున, సుదర్శన్‌రెడ్డి, నాగిరెడ్డి పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి

• డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు • తిప్పర్తిలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



తిప్పర్తిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు

తిప్పర్తి : రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు సూచించారు. మండల కేంద్రంలో గురువారం పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతులు తేమ శాతం దృష్టిలో పెట్టుకొని మట్టి, తాలు లేకుండా ధాన్యం తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో డీఎం నాగేశ్వర్‌రావు, డీసీఓ కిరణ్‌కుమార్, మార్కెటింగ్ ఏడీ శ్రీకాంత్, ఏఓ సన్నిరాజు, సీఈఓ భిక్షమయ్య, ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రెడ్డి, ఏఈఓ సంతోషి పాల్గొన్నారు.

### ఖాజీరామారంలో ప్రారంభించిన డీఆర్డీఓ పీడీ

నల్లగొండ రూరల్ : మండలంలోని ఖాజీరామారంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని డీఆర్డీఓ పీడీ నాగిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 17శాతం లోపు తేమ ఉండేలా ధాన్యం ఆరబెట్టుకొని సెంటర్‌కు తీసుకురావాలని సూచించారు. సీరియల్ నంబర్ ప్రకారం నిర్వాహకులు ధాన్యం కొనుగోళ్లు చేయాలన్నారు. కార్యక్రమంలో తాసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ వెంకట్‌రెడ్డి, ఏఓ శ్రీనివాస్, ఏపీఓ వినోద, సీసీ గీత, ఎస్‌ఆర్పీ నాగలక్ష్మి, దండంపల్లి రవికూమార్, కృష్ణ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## పెర్కకొండారంవాసికి హెటీయూ డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న వీరభద్రం

శాలిగౌరారం, మార్చి 28 : మండలంలోని పెర్కకొండారం గ్రామానికి చెందిన భీమనబోయిన వీరభద్రానికి న్యూఢిల్లీలోని హోప్ థియోలాజికల్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ అవార్డును ప్రదానం చేసింది. వీరభద్రం హైదరాబాద్‌లోని దిల్‌సుఖ్‌నగర్‌లో గత మూడేండ్లుగా అమ్మజ్యోతి అనాథాశ్రమం ఏర్పాటు చేసి నిర్వహిస్తున్నాడు. ఎంతోమంది అనాథలను అక్కున చేర్చుకొని నిత్యం సేవలందిస్తున్నాడు. వీరభద్రం సేవలను గుర్తించిన హోప్ థియోలాజికల్ యూనివర్సిటీ బుధవారం రాత్రి న్యూఢిల్లీలో డాక్టరేట్ ఆఫ్ బెస్ట్ సోషల్ సర్వీస్ అవార్డును ప్రదానం చేసినట్లు చెప్పారు. వీరభద్రానికి పలువురు అభినందనలు తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

**పాస్‌పోర్ట్ పోయినది**

గగ్గేనపల్లి యశ్వంత్‌రెడ్డి, S/o. నర్సింహ్మారెడ్డి, R/o. గగ్గేనపల్లివారిగూడెం, H/o. వేంపాడు గ్రా॥, నిడమనూర్ మం॥, నల్లగొండ జిల్లాకు చెందిన ఒరిజినల్ పాస్‌పోర్ట్ నెం. U9208347 గలది తేది:20/02/2024 రోజున గగ్గేనపల్లివారి గూడెం నుండి నిడమనూర్‌కు బైక్‌పై వస్తుండగా పోయినది. దొరికినవారు సంప్ర॥

సెల్: 95422 80508

**PLOT FOR SALE**

★విజయవాడ హైవే @ రామోజీ ఫిల్మ్‌సిటీ ప్రక్కనే హైవే ఫేసింగ్‌కు & ఇళ్ల మధ్య HMDA వెంచర్‌లో వెంటనే ఇళ్లు కట్టుకునే ప్లాట్లు, బ్యాంక్ లోన్ సౌకర్యం కలదు. ఫోన్: 9666607146.
NT-5746

**PLOT FOR SALE**

★7th ఏప్రిల్ న్యూ వెంచర్ లాంచింగ్ విజయవాడ హైవే, నార్కెట్‌పల్లి దగ్గర 4 లైన్ల రోడ్ ప్రక్కన ఆహ్లాదకరమైన వాతావరణం నందు కాంపౌండ్ వాల్, స్విమ్మింగ్ పూల్, క్లబ్‌హౌస్ సౌకర్యంతోపాటు ఎర్రచందనం & 40 రకాల పండ్లమొక్కలతో 10 గుంటల ప్లాట్లు కలవు. గజం: 2,199/- మాత్రమే. సంప్ర: 9346363436.
NT-327974

**FLAT FOR SALE**

★Ready to Move: Hayathnagar Near Vijayawada Highway Beside Bus Stop Sup. Luxurious 3BHK Flats, 2 Side 30' Rd. Ph: 9247326642 / 9849801477.
NT-327957

ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines,
Extra Line - Extra Amount

నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం

| | | |
|---|---|---|
| నల్లగొండ : 9182777626 | నల్లగొండ : 9182777635 | దేవరకొండ : 9182777635 |
| హాలియా : 9182777059 | | |
| మిర్యాలగూడ : 9182777059 | | |

# కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్

• ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వసతులు కరువు



తాటికల్ పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో టెంట్ లేక తాటిచెట్టు నీడలోనే సేద తీరుతున్న రైతు

నకిరేకల్, మార్చి 28 : యాసంగి ధాన్యం సేకరణపై కలెక్టర్, అదనపు కలెక్టర్లు ఇటీవల పీఏసీఎస్, ఐకేపీ, డీసీఎంఎస్‌లకు జారీచేసిన ఆదేశాలను కొంతమంది అధికారులు లెక్కచేయడం లేదు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తాగునీరు, టెంట్లు, విద్యుత్ సౌకర్యం, టార్పాలిన్లు, ప్యాడీ క్లీనర్లు, వేయింగ్ స్కేళ్లు, మాయిశ్చరైజ్ మీటర్లు, మహిళలకు తాత్కాలిక మరుగుదొడ్లు తదితర సౌకర్యాలను ముందస్తుగానే ఏర్పాటు చేయాల్సి ఉంది. కానీ, తాటికల్ పీఏసీఎస్ ఆధ్వర్యంలో చీమలగడ్డ, గోరెంకలపల్లి, మంగళపల్లి, తాటికల్, నెల్లిబండ కేంద్రాలకు 20 రోజుల నుంచి ధాన్యం తీసుకొస్తున్నా కనీస వసతులు కల్పలించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నకిరేకల్ పట్టణ కేంద్రంలోని చీమలగడ్డ కేంద్రానికి 80 మంది రైతులు తమ ధాన్యాన్ని తీసుకొచ్చారు. పీఏసీఎస్ సిబ్బంది సెంటర్‌కు వచ్చి సీరియల్ నంబర్లు రాసుకొని పోతున్నారే తప్ప కనీసం తాగునీటి సౌకర్యం కల్పించలేదని వాపోతున్నారు. దాదాపు 20 రోజుల నుంచి ప్రతి రోజూ రూ.40 నుంచి 60 వెచ్చించి వాటర్ బాటిళ్లు కొంటున్నామని రైతులు చెబుతున్నారు. కొనుగోలు కేంద్రం పక్కనే నిమ్మ మార్కెట్ ఉండడంతో రాత్రిపూట మహిళలు మూత్ర విసర్జనకు వెళ్లాలంటే ఇబ్బంది పడాల్సి వస్తుందని వాపోతున్నారు. ఎండకు తట్టుకోలేక అనారోగ్యానికి గురవుతున్నామని గగ్గోలు పెడుతున్నారు. తమ ఇబ్బందులు అధికారులకు పట్టవా? అని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కనీస వసతులు కల్పించాలని రైతులు కోరుతున్నారు.

## లోక్‌సభ ఎన్నికల్లో బీసీలకు కాంగ్రెస్ మొండిచేయి

• బీసీ సంఘం ఆధ్వర్యంలో కండ్లకు గంతలు కట్టుకొని నిరసన



పట్టణంలోని జ్యోతిబాపూలే విగ్రహం వద్ద కళ్లకు గంతలు కట్టుకొని నిరసన వ్యక్తం చేస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

మిర్యాలగూడ, మార్చి 28 : లోక్‌సభ సీట్ల కేటాయింపులో ఉమ్మడి నల్లగొండ జిల్లా బీసీలను కాంగ్రెస్ పార్టీ అన్యాయానికి గురి చేసిందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నల్లగొండ కుందూరు రఘువీర్‌రెడ్డి, భువనగిరి చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి కేటాయించడంపై గురువారం పట్టణంలోని సాగర్‌రోడ్డులో గల జ్యోతిబాపూలే విగ్రహం వద్ద కండ్లకు గంతలు కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా లింగంగౌడ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే టికెట్ల కేటాయింపులో చేసిన అన్యాయమే మళ్లీ ఎంపీ అభ్యర్థుల ఎంపికలో చేసిందని పేర్కొన్నారు. ఆత్మగౌరవం, సామాజిక న్యాయం అని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ కుటుంబ పాలనకు తెర లేపిందన్నారు. ఇది ప్రజాపాలన అంటున్న సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత నేటి వరకు ఏయే సామాజిక వర్గాలకు ఎన్ని పదవులు ఇచ్చారో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బీసీల ఆగ్రహానికి గురిగాక తప్పదన్నారు. కార్యక్రమంలో బంటు వెంకటేశ్వర్లు, సంజీవ్, బ్రహ్మాచారి, రవి, వంశీ పాల్గొన్నారు.

## రైతులను ఆదుకోకపోతే ఉద్యమిస్తాం

• మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నార్కట్‌పల్లి, మార్చి 28 : రైతులను ఆదుకోకపోతే ఉద్యమిస్తామని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. గురువారం మండలంలోని చిన్న నారాయణపురంలో ఎండిన పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని ఆరోపించారు. రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. గత పదేండ్లుగా సాగునీరు లేక ఎన్నడూ పంటలు ఎండిపోలేదని, ఈ ఏడాది పంట చేతికందే దశలో నీళ్లు లేక రైతులు పంటలను పశువుల మేతకు ఉపయోగిస్తున్నారన్నారు. 100 రోజులైనా రుణ మాఫీ ఊసేలేదని విమర్శించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్ రెడ్డి, యానాల అశోక్‌రెడ్డి, కొండూరు శంకర్, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## ‘నీటి కోసం బావుల పూడికతీత’ కథనానికి స్పందన

• రైతు సైదులు పొలాన్ని పరిశీలించిన ఏఓ సౌమ్యశృతి



మాదారంలో చింతల సైదులు పొలాన్ని పరిశీలిస్తున్న ఏఓ సౌమ్యశృతి

శాలిగౌరారం, మార్చి 28 : ‘నీటి కోసం బావుల పూడికతీత’ శీర్షికన నమస్తే తెలంగాణ మినీలో గురువారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈ మేరకు జిల్లా వ్యవసాయ అధికారి ఆదేశాల మేరకు మండల వ్యవసాయ అధికారి సౌమ్యశృతి ఏఈఓలతో కలిసి మండలంలోని మాదారం గ్రామానికి చెందిన రైతు చింతల సైదులు పొలం వద్దకు వెళ్లి వరిని పరిశీలించారు. ఎంత సాగు చేశారు? ఎంత ఎండిపోయింది? అని రైతును వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పూడిక తీసిన బావిని పరిశీలించారు. పూడిక తీయక ముందు ఎన్ని గంటలు నీరందించేది, పూడిక తీసిన తర్వాత ఎన్ని గంటలు నీరు పోస్తుంది అని రైతును అడగ్గా.. పూడిక తీయక ముందు 3 గంటలు, పూడిక తీశాక 5 గంటలు నీరు అందిస్తుందని రైతు తెలిపినట్లు చెప్పారు. పూర్తి వివరాలను ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు ఏఓ తెలిపారు. ఆమె వెంట ఏఈఓలు ప్రదీప్, శ్రవణ్‌రెడ్డి ఉన్నారు.

## నాటకం సమాజాన్ని ఎంతో ప్రభావితం చేస్తుంది

• కేంద్రీయ విశ్వవిద్యాలయం హైదరాబాద్ ప్రొఫెసర్ త్రివేణి

రామగిరి, మార్చి 28 : నాటకం సమాజాన్ని ఎంతో ప్రభావితం చేస్తుందని కేంద్రీయ విశ్వవిద్యాలయం హైదరాబాద్ తెలుగు శాఖ అధిపతి ప్రొఫెసర్ త్రివేణి అన్నారు. నల్లగొండలోని ఎన్జీ కళాశాలలో నాటక సాహిత్యంపై నిర్వహిస్తున్న రెండు రోజుల జాతీయ సదస్సు గురువారం ముగిసింది. దీనికి ఆమె హాజరై మాట్లాడుతూ.. పురుషులే కాకుండా స్త్రీలు కూడా నాటకాలను రాసి నాటక సాహిత్యాన్ని సుసంపన్నం చేశారని కొనియాడారు. తెలంగాణ భాషా సాంస్కృతిక మండలి అధ్యక్షుడు గంటా జలంధర్‌రెడ్డి మాట్లాడుతూ సమైక్య రాష్ట్రంలో తెలంగాణ సాహిత్యానికి అంతగా ఆదరణ ఉండేది కాదని, ఇప్పుడు స్వరాష్ట్రంలో తెలుగు సాహిత్యాన్ని ఆదరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ సముద్రాల ఉపేందర్ మాట్లాడుతూ ప్రపంచ భాషల్లో తెలుగు భాషకు ప్రధానమైన స్థానం ఉందని, అటువంటి భాష విశిష్టతను తెలియజేసే అనేక సాహిత్య ప్రక్రియలు తెలుగులో వెలువడ్డాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాటక రంగ పరిశోధకులు తాటికొండల నరసింహారావు, ఎన్వీ రఘువీర్‌ప్రతాప్, రంగస్థలం నటులు, కోమలి కళా సమితి అధ్యక్షుడు బక్క పిచ్చయ్య, ఎంఎల్ నరసింహారావు, తెలుగు శాఖ అధ్యక్షులు తండు కృష్ణ కౌండిన్య, గ్రంథాలయ శాస్త్ర అధ్యాపకుడు దుర్గాప్రసాద్, అధ్యాపకులు, పరిశోధన విద్యార్థులు పాల్గొన్నారు.

## గిరిజనుల హోలీ సంబురం

చందంపేట, మార్చి 28 : గిరిజనుల సంప్రదాయం ప్రకారం ఉమ్మడి చందంపేట మండలంలోని పలు గ్రామాల్లో గురువారం హోలీ సంబురాలు జరిపారు. పోలేపల్లి, మానావత్‌తండా, బండమీదితండా, పొల్యనాయక్‌తండా, బుడ్డోనితండా, పెద్దమునిగల్, చిన్నమునిగల్, బచ్చాపురం, దాసర్లపల్లి, మోసంగడ్డతండాలో తెల్లవారుజాము నుంచే ఒకరిపై ఒకరి రంగులు చల్లుకున్నారు. ఈ సందర్భంగా గిరిజనుల ఆటపాటలు అలరించాయి. కార్యక్రమంలో ఎంపీపీ పార్వతీచందూనాయక్, జడ్పీటీసీ బుజ్జీలచ్చిరాంనాయక్, పీఏసీఎస్ చైర్మన్ జాలె నర్సింహారెడ్డి, నాయకులు నాగేశ్వర్‌నాయక్, రమేశ్, మకట్‌లాల్, రమేశ్, చంద్రబాబు, జీవన్, డాక్యానాయక్, దాస్యనాయక్, రఘుభగత్, బిక్యానాయక్, మంజ్యానాయక్, జవహర్‌లాల్ పాల్గొన్నారు.

## అప్పు ఎగ్గొట్టేందుకే మహిళ హత్య : డీఎస్పీ

నల్లగొండ సిటీ, మార్చి 28 : వివాహేతర సంబంధం పెట్టుకుని మహిళ వద్ద తీసుకున్న అప్పు ఎగ్గొట్టాలనే ఉద్దేశంతో ప్రథకం ప్రకారం మహిళను హత్య చేసిన ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసినట్లు నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి తెలిపారు. గురువారం ఎస్పీ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హత్య వివరాలు వెల్లడించారు. నార్కట్‌పల్లి మండలం ఔరవాణికి చెందిన ముప్పిడి పిచ్చమ్మ(63)ఈ నెల 21 రాత్రి నుంచి కనిపించడం లేదని మృతురాలి తమ్ముడు పందుల యాదయ్య ఈ నెల 22న నార్కట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న క్రమంలో ఈ నెల 24 న మృతురాలి మృతదేహం గ్రామంలోని నకిరేకంటి అచ్చయ్యకు చెందిన పాడుబడిన బావిలో కనిపించడంతో బయటకు తీయగా ఆమె తలకు గాయాలు కనిపించాయి. మృతురాలి మేనల్లుడు, బంధువుల అనుమానం మేరకు అదే గ్రామానికి చెందిన శిలువేరు లక్ష్మయ్య మృతురాలితో లైంగిక సంబంధం ఉన్నట్లు తెలిసింది. దాంతో అతన్ని విచారించగా లక్ష్మయ్య లైంగిక సంబంధం పెట్టుకొని మృతురాలి నుంచి రూ.1,50,000 అప్పుగా తీసుకున్నాడు. పిచ్చమ్మ డబ్బులు అడుగుతుండంతో ఈ విషయాన్ని గతంలో ఆమెతో లైంగిక సంబంధం పెట్టుకొని ఆమె నుంచి రూ.లక్ష తీసుకున్న నకిరేకంటి చంద్రమోహన్‌కు తెలుపడంతో తనను కూడా మృతురాలు ఎక్కడ పడితే అక్కడ డబ్బులు అడుగుతుందని తెలిపాడు. వీరితోపాటు మరో వ్యక్తి నారబోయిన అంజయ్య కూడా గతంలో ఆమె వద్ద రూ.40వేలు తీసుకొని ఇచ్చినప్పటికీ డబ్బు ఇవ్వలేదని పంచాయితీ పెట్టి వసూలు చేసిందనే కోపంతో అతను కూడా ఆమెపై పగ పెంచుకుని ముగ్గురు కలిసి పథకం ప్రకారం ఆమెను కర్రలతో కొట్టి చంపి బావిలో పడేశారని తెలిపారు. నేరం రుజువు కావడంతో వీరిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పర్చినట్లు చెప్పారు.

## ఖబ్రస్తాన్‌ను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోండి

• కలెక్టర్ హరిచందనకు ముస్లింల వినతి

కట్టంగూర్, మార్చి 28 : మండలంలోని మునుకుంట్ల గ్రామంలో గల ఖబ్రస్తాన్ స్థలాన్ని ఆక్రమించిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన ముస్లింలు గురువారం జిల్లా కలెక్టర్ హరిచందనకు వినతిపత్రం అందజేశారు. గ్రామంలోని సర్వే నంబర్ 602/1లో ఉన్న ఖబ్రస్తాన్ స్థలాన్ని గ్రామానికి చెందిన పన్నాల రవి, మాండ్ర వీరయ్య ఆక్రమించి మట్టిపోసి చదును చేశారని, వారిపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో షేక్ కాశీం, పర్వీన్, నూర్ పాషా, ఎస్కే సైదాబీ, షేక్ బాబు, సానియా ఉన్నారు.

## బీసీలను విస్మరిస్తున్న కాంగ్రెస్ : జాజుల



సమావేశంలో మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనువాస్‌గౌడ్

మునుగోడు, మార్చి 28 : జనాభాలో 60 శాతానికి పైగా ఉన్న బీసీలను కాంగ్రెస్ విస్మరించిందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనువాస్‌గౌడ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సామాజిక న్యాయం , బీసీ కుల గణన చేయాలంటున్న రాహుల్‌గాంధీ కాంగ్రెస్ పాలిత ప్రాంతాల్లో బీసీలకు టికెట్ల కేటాయింపులో అన్యాయం జరుగుతున్నా ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ ప్రజాపాలన పేరుతో కులపాలన చేస్తుందని, ఆ విధానాన్ని మార్చుకోవాలని హితవు పలికారు. కాంగ్రెస్ పార్టీ విధానాన్ని మార్చుకోకపోతే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు బూడిద లింగయ్యాదవ్, మేకల మల్లయ్య, గురిజ నర్సింహగౌడ్, ఈదులకంటి కైలాశ్‌గౌడ్, జాజుల సత్యనారాయణ, రాజు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రీజినల్ జాయింట్ డైరెక్టర్ యాదగిరి

## ప్రభుత్వ కళాశాలల అభివృద్ధికి అడ్మిషన్లు పెంచాలి

• రీజినల్ జాయింట్ డైరెక్టర్ యాదగిరి

మిర్యాలగూడ, మార్చి 28 : ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అభివృద్ధికి అడ్మిషన్లను పెంచాలని రీజినల్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ జి.యాదగిరి అన్నారు. గురువారం ఆయన స్థానిక కేఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఆకస్మికంగా సందర్శించి మాట్లాడారు. ప్రధానమంత్రి ఉచ్ఛత సర్వశిక్ష అభియాన్ పథకం ద్వారా తెలంగాణలో 16 కళాశాలల్లో కేఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఒకటిగా నిలిచి ప్రాజెక్టు సాధించడంపై ఆయన కళాశాల ప్రిన్సిపాల్‌ను, సిబ్బందిని అభినందించారు. కళాశాల అభివృద్ధికి సలహాలు, సూచనలు చేశారు. అనంతరం కళాశాల సిబ్బంది ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ భిక్షమయ్య, ప్రధానమంత్రి ఉచ్ఛత సర్వశిక్ష అభియాన్ పథకం నోడల్ ఆఫీసర్ రాంరెడ్డి, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

## అర్హులంతా ఓటు హక్కు వినియోగించుకోవాలి

• అదనపు కలెక్టర్ పూర్ణచందర్
• సమాచార హక్కు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఓటు చైతన్య ర్యాలీ



ఓటు చైతన్య ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ పూర్ణచందర్

రామగిరి, మార్చి 28 : అర్హులంతా విధిగా ఓటు హక్కు వినియోగించుకోవాలని అదనపు కలెక్టర్ పూర్ణచందర్ సూచించారు. సమాచార హక్కు పరిరక్షణ సమితి, ఎలక్షన్ వాచ్ కమిటీ జాతీయ చైర్మన్ డాక్టర్ బొమ్మరబోయిన కేశవులు ఆధ్వర్యంలో గురువారం ఓటరు చైతన్య ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల వద్ద ర్యాలీని జెండా ఊపి ప్రారంభించిన అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశం భారత దేశమన్నారు. కులం, మతం, లింగ భేదం లేకుండా రాజ్యాంగం అందరికీ సమానంగా ఓటు హక్కు కల్పించిందని అన్నారు. ఓటు అనే ఆయుధంతో మంచి నాయకుడిని ఎన్నుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులు ర్యాలీగా గడియారం సెంటర్ వరకు వెళ్లారు. కార్యక్రమంలో జల సాధన సమితి అధ్యక్షుడు దుశ్చర్ల సత్యనారాయణ, ఉమెన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఘన్‌శ్యాం, అధ్యాపకులు, పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా చూడాలి

• ఎంపీపీ దూదిపాల రేఖాశ్రీధర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ దూదిపాల రేఖ

కొండమల్లేపల్లి, మార్చి 28 : వేసవి దృష్ట్యా మండలంలో తాగునీటి సమస్య రాకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎంపీపీ దూదిపాల రేఖాశ్రీధర్‌రెడ్డి సూచించారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ రేఖ అధ్యక్షతన ఎంపీడీఓ ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. లోక్‌సభ ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఎలాంటి తీర్మానాలు చేయకుండానే 10 నిమిషాల్లో తూతూమంత్రంగా సమావేశాన్ని ముగించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. గ్రామాల్లో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని సూచించారు. అధికారులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి సమన్వయంతో పనులను పూర్తి చేయాలన్నారు. అధికారులు తమ శాఖల ద్వారా ప్రజలకు సంక్షేమ పథకాలు అందించాలన్నారు. మిషన్ భగీరథ నీరు పలు గ్రామాలకు అందడంలేదని పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని పలువురు ఎంపీటీసీలు ఆరోపించారు. సమావేశంలో జడ్పీటీసీ పస్నూరి సరస్వతమ్మ, వైస్ ఎంపీపీ కాసర్ల వెంకటేశ్వర్లు, ఎంపీఓ నర్సింహారావు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

## అపెక్స్ ఒలింపియాడ్‌లో సెయింట్‌జాన్స్ విద్యార్థుల ప్రతిభ

మిర్యాలగూడ, మార్చి 28 : అపెక్స్ ఒలింపియాడ్ నిర్వహించిన పరీక్షలో సెయింట్ జాన్స్ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటినట్లు ప్రిన్సిపాల్ అలుగుబెల్లి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన పాఠశాలలో మాట్లాడుతూ పరీక్షకు తమ పాఠశాల నుంచి వంద మంది విద్యార్థులు హాజరు కాగా ఎ.శివకుమార్, ఎం.శివకుమార్, శశికుమార్, లాస్య, మనస్విని బంగారు పతకాలు, జీవన జ్యోతి, సహర్ష్, దీవెన, అనురాగ్, కీర్తన వెండి పతకాలు సాధించినట్లు తెలిపారు. మిగతా 90 మంది విద్యార్థులు ప్రశంసాపత్రాలు అందుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ అలుగుబెల్లి శిరీష, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఎన్నికల నిర్వహణకు సహకరించాలి : డీఎస్పీ

తిప్పర్తి, మార్చి 28 : ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ప్రజలు సహకరించాలని నల్లగొండ డీఎస్పీ శివరాం కోరారు. గురువారం మండల కేంద్రంలో అదనపు బలగాలతో కవాతు నిర్వహించారు. ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయం సంఘటనలు చోటు చేసుకోకుండా ముందుజాగ్రత్త చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి అక్కడ ప్రత్యేక నిఘా పెట్టనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో శాలిగౌరారం సీఐ శ్రీనివాస్ రెడ్డి, తిప్పర్తి ఎస్ఐ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

## పేరూరులో రాజకీయ కక్ష సాధింపు

• కాంగ్రెస్‌కు ఓట్లు వేయలేదన్న నెపంతో మిషన్ భగీరథ నల్లా తొలగింపు



మిషన్ భగీరథ నల్లా వద్ద నీళ్లు పట్టుకుంటున్న మహిళ(ఫైల్)



నల్లాను తొలగిస్తున్న సిబ్బంది

హాలియా, మార్చి 28 : కాంగ్రెస్ పాలనలో నాగార్జునసాగర్ నియోజకవర్గంలో రాజకీయ కక్ష సాధింపు పరాకాష్టకు చేరింది. గడిచిన వంద రోజుల్లో బీఆర్‌ఎస్ కార్యకర్తలను బెదిరించడం, వేధించడం స్థానిక కాంగ్రెస్ నాయకులకు సర్వసాధారణమైంది. ఇటీవల అక్రమ నిర్మాణం పేరుతో హిల్‌కాలనీలో బీఆర్‌ఎస్ నాయకుడి సోదరుడి ఇంటిని కూల్చివేయగా, ఇది చాలదన్నట్లు తాజాగా అనుముల మండలం పేరూరు బీసీ కాలనీలో 10 మంది మంచినీళ్లు తాగేందుకు ఏర్పాటు చేసిన మిషన్ భగీరథ నల్లాను కాంగ్రెస్ నాయకులు అధికారులతో తొలగింపజేసి ఆనందం పొందుతున్నారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రజల అవరాలను దృష్టిలో పెట్టుకొని గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం గ్రామంలో మూడు పబ్లిక్ నల్లాలు ఏర్పాటు చేసింది. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గ్రామంలో సరైన మెజార్టీ రాలేదని, బీసీ కాలనీ వారు కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేయలేదని చెప్పి అక్కసు పెంచుకున్న స్థానిక నాయకులు బీసీ కాలనీలో ఏర్పాటు చేసిన నల్లా తొలగించాలని అధికారులపై ఒత్తిడి తెచ్చారు. దాంతో మిషన్ భగీరథ ఏఈ, డీఈ గ్రామానికి వచ్చి పబ్లిక్ నల్లాను తొలగించారు. ఈ విషయమై సంబంధిత ఏఈ నరేశ్‌ను ఫోన్‌లో సంప్రదించగా.. నల్లా మెయిన్‌లైన్‌కు ఉండడంతో ట్యాంక్‌కు నీళ్లు ఎక్కనందున తొలగించినట్లు తెలిపారు. నల్లా తొలగింపుతో కాలనీ వాసులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.